క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలిలోని వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులకు రూ.3.50 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందించారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న స్థానిక నాయకులు, అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాలెంలో ఇటీవల మరణించి అడుసుమల్లి సురేష్‌కుమార్ కుటుంబానికి తక్షణ సహాయంగా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలను ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ భర్త వైఎస్సార్‌సీపీ నేత పెమ్మసాని శ్రీనివాసులునాయుడు మంగళవారం అందజేశారు. వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, సచివాలయ సంక్షేమాధికారి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



బసినేనిపల్లిలో పనులు పరిశీలిస్తున్న దృశ్యం

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో రూ.63 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, హెచ్‌ఎం అంజయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తి చేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు.

సీఐ నాగేశ్వరరావుకు ఘన నివాళి



సీఐ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మర్రిపాడు పోలీసులు

మర్రిపాడు: ఆత్మకూరు సీఐ మల్లి నాగేశ్వరరావు విధి నిర్వహణలోనే గుండెపోటుతో మృతి చెందడంతో మర్రిపాడు పోలీసులు మంగళవారం ఘన నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్సై శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందరితో కలివిడిగా ఉంటూ మంచి మనస్సున్న పోలీసు అధికారి నాగేశ్వరరావు మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా, ఆత్మకూరు సీఐగా విధులు నిర్వహించి ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై భాస్కర్, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛతా అవార్డుల ఎంపికకు మహిళలు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పారిశుధ్య ఘనవ్యర్థాల నిర్వహణలో ప్రతిభచూపిన మహిళలకు స్వచ్ఛతా అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వయం సహాయక, చిన్న తరహా సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, చెత్త నుంచి సంపద తయారీ పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, మొదలైన విభాగాల్లో మహిళలను అవార్డులకు ఎంపిక చేయనున్నట్లు ఆయన వివరించారు.

అల్లూరులో..

అల్లూరు: పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు ఉమన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ, మంచి నీటిని శుద్ధి చేసే పద్ధతులు, తడి-పొడి చెత్త నుంచి సంపద తయారీ, స్వచ్ఛతపై అవగాహన, నూతన ఆవిష్కరణ విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు మాత్రమే ఈ అవార్డులకు అర్హులని ఈ నెల 22వ తేదీలోపు అల్లూరు నగర పంచాయతీలోని అన్ని సచివాలయాలోని కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

'రాగి జావ' పౌష్టికాహారం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



బిట్రగుంట: విద్యార్థులకు రాగిజావ అందజేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు పోషకాహారం అందజేయాలనే ధ్యేయంతో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ 'నాడు–నేడు' ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్ తరాలకు బలమైన పునాదులు వేస్తున్నారన్నారు. విద్యార్థులకు పౌష్టికారం ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్ 'గోరుముద్ద' పేరుతో బలవర్ధకమైన ఆహారాన్ని అందజేస్తున్నరని ఎమ్మెల్యే చెప్పారు. పిల్లలకు చదువు తో పాటు, ఆరోగ్యం కూడా బాగుండాలనే అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని అన్నారు.

రాగిజావతో సంపూర్ణారోగ్యం

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంపూర్ణారోగ్యాన్ని కాంక్షిస్తూ రాగిజావను అందిస్తున్నట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అమరావతి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాగిజావ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. వారు మాట్లాడుతూ మండలంలో 59 పాఠశాలల్లోని 3,386 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్షియా, రామకృష్ణారెడి పాల్గొన్నారు.

దాసరపల్లెలో..

మండలంలోని దాసరపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీ సయ్యద్ సుభాన్, పీఏసీ చైర్మన్ సయ్యద్ ఖాజామొహిద్దీన్ విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గాజుల ఫారుఖ్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాగిజావ పంపిణీ

జలదంకి: జలదంకి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి విద్యార్థులకు రాగిజావను అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం కలుగకుండా పోషక విలువలున్న రాగిజావను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. జమ్మలపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో కావలి డీఈఓ హరిప్రసాద్, జలదంకి ఎంఈఓ శ్రీధర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కొండారెడ్డి, సర్పంచ్ బుర్రి శ్రీవేణి ప్రారంభించారు.

మంచి పోషకాలు అందుతాయి

వరికుంటపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే రాగిజావ ద్వారా మంచి పోషకాలు అందుతాయని జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శారీరక దృఢత్వం

సీతారామపురం: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా అందిస్తున్న రాగిజావ వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం ఏర్పడుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ పల్లె విజయమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంజయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగి జావతో పోషక విలువలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 450 మందికిపైగా విద్యార్థులకు మంగళవారం రాగి జావ పంపిణీ చేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ అందజేశారు. హెచ్‌ఎం టీ పుల్లయ్య, పీడీ తిరుపతయ్య, ఉపాధ్యాయులు మధుసూదన్‌శాస్త్రి, రమేష్, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు రాగి జావ పంపిణీ చేపట్టారు. పలు పాఠశాలల్లో ఎంఈఓ షేక్ నజీర్ నేతృత్వంలో రాగి జావ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.

రాగి జావ పోషకాహారం

ఆత్మకూరురూరల్: రాగిజావతో చిన్నారులకు పోషకాహారమని పలు పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని సుమారు 70కిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ప్రభుత్వం అందజేసే రాగిజావను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి పది గ్రాముల రాగి పిండి, పది గ్రాముల బెల్లం జావగా తయారు చేసి వేసవి సెలవులు ప్రకటించే వరకు రోజు మార్చి రోజు అందజేస్తామన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏఎస్‌పేట ఎస్సై నరేష్ మంగళవారం రాగిజావను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఈ రాగిమాల్ట్ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యానికి రాగిమాల్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హమీద్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై జగనన్న ప్రత్యేక శ్రద్ధ

సోమశిల: విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తే వారి ఆరోగ్యం బాగుంటుందని, దీంతో వారు ఇంకా బాగా చదువుకున్న ఉన్నత స్థాయికి చేరుతారనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. మంగళవారం అనంతసాగరంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.బాలకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ శోభ, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే సీఎం లక్ష్యం

సంగం: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో మరింత మెరుగైన చదువులు చదవాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంపీడీఓ గోపి, ఎంఈఓ జానకిరాం తెలిపారు. సంగంలోని రాళ్లచెలిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 57 పాఠశాలలకు మూడు రోజుల పాటు ఉదయం సమయంలో రాగిజావ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ ప్రారంభం

మర్రిపాడు: మండలంలోని తిమ్మానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ రాచాల గీత, ప్రధానోపాధ్యాయిని భార్గవి ప్రారంభించారు. వారంలో మూడు రోజులు రాగి జావ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, అనూష, స్కూల్ కమిటీ చైర్మన్ ఖాన్‌సావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ అందజేత

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో డీఎల్‌డీఓ టి.రమణయ్య విద్యార్థులకు రాగి జావ పంపిణీ ప్రారంభించారు. రాగిజావతో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీరాజ్యం, పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర, పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీరాములు, లతామంగేశ్వరి, సోమలింగేశ్వరావు సీఆర్పీ మల్లికార్జున పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

కొండాపురం: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం రాగిజావను పంపిణీ చేశారు. కొండాపురం జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం అబ్దుల్‌రహీం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతారామపురం: బసినేనిపల్లిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న చింతంరెడ్డి సుబ్బారెడ్డి



ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



ఆత్మకూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం



ఏఎస్‌పేట: విద్యార్థినికి రాగిమాల్ట్ అందజేస్తున్న ఎస్సై నరేష్



కలిగిరి: రాగిజావను విద్యార్థులకు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మాల్యాద్రిరెడ్డి



మర్రిపాడు: రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ప్రధానోపాధ్యాయిని



ఉదయగిరి: దళితవాడ పాఠశాలలో సీఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎంఈఓ,ఎంపీడీఓ



జలదంకి: పాథమిక పాఠశాలలో రాగిజావను అందిస్తున్న ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి



వరికుంటపాడు: విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న ప్రజాప్రతినిధులు



సంగం: విద్యార్థులకు రాగజావ అందజేస్తున్న ఉపాధ్యాయులు



సోమశిల: విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

ప్రతి రైతును ఆదుకుంటాం



అన్నవరంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



కలిగిరి: కుమ్మరకొండురులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

• ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

జలదంకి: అకాల వర్షాలకు నష్టపరిహారం అందిస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అన్నవరం, చినక్రాక గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. నష్టాల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారని, తాను కూడా విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, కావలి ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, ఏఓ శైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు రావి ప్రసాద్, గుర్రం జగ్గయ్య, అన్నవరం సర్పంచ్ గుమ్మడి రమేష్, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, సురేశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారానికి చర్యలు

కలిగిరి: ప్రతి రైతుకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కుమ్మరకొండూరులో దెబ్బతిన్న పంటలను, ఇళ్లను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అకాల వర్షాలు, ఈదురుగాలులకు వరి, పత్తి, మిరప పంటలు పూర్తి దెబ్బ తినడం చూసి ఎమ్మెల్యే మేకపాటి చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని ఈ ప్రాంతంలో పంట నష్టం వివరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ట్రాన్స్‌కో అధికారులు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్నారన్నారు. పంట నష్టాల వివరాల సేకరణ పారదర్శకంగా ఉండాలని కావలి ఆర్డీఓ శీననాయక్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకుడు నోటి జనార్దన్‌రెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఆర్‌లో మెగా ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అల్‌స్టోమ్ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం మెగా ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి 715 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ ఎంపికలకు 28 సాఫ్ట్‌వేర్, వివిధ కంపెనీలు హాజరవుగా దాదాపు 427 మంది పైగా విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కంపెనీ ఆఫర్ లెటర్లు అందించారు. ఆర్‌ఎస్‌ఆర్ కళాశాల ద్వారా కళాశాలలో చదువుకున్న విద్యార్థులకే కాకుండా జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజారెడ్డి, పలు కంపెనీల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునే దిశగా కృషి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో రైతులను ఆదుకునే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రెండు రోజుల కితం కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షానికి పూర్తిగా నెలకొరిగిపోవడం బాధాకరమన్నారు. ఏ రైతు కూడా నష్టపోకుండా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. అధికారులు గ్రామాల్లోని పంటలను పరిశీలించేందుకు వస్తారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు ఉన్నారు.

మామిడి రైతులు జాగ్రత్తలు పాటించాలి

కావలి: అకాల వర్షాలు, ఈదురు గాలులతో దెబ్బతిన్న మామిడి రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారిణి సుధామయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వర్షాలు వల్ల మామిడి కాయలపై మచ్చలు రావడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. 1 సెంటీ మీటర్ కంటే అధిక వర్షం పడిన ప్రాంతాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం మామిడి తోటలు పూత దశ నుంచి కాయల కోత వరకు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎక్కడైతే కాయలు 100 గ్రాములుపైన ఉన్న తోటల్లో ఈ వర్షం వలన పిందెలు గట్టిపడి సైజు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కాయలు, పూత ఉన్న తోటల్లో కాయ మచ్చ తెగులు, పూరెమ్మ మూడు తెగులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ తెగుళ్ల నివారణకు ఇమిడాక్లోప్రిడ్, కార్బండజిమ్, మ్యాంకోజెబ్‌లు తగినంత మోతాదుల్లో కలిపి పిచికారీ చేయాలన్నారు. చిన్న పిందెలు, పూత దశలో ఉన్న తోటల్లో ఈ అకాల వర్షాలకు లేత చిగురు రావడానికి అవకాశం అధికంగా ఉంటుందని, లేత చిగురులకు ఆశించే రసం పీల్చే పురుగులు, వాటితో పాటు వచ్చే తేనే మంచు పురుగు, తామర పురుగులు ఆశించిన ఎడల ఇమిడాక్లోప్రిడ్ ఫిప్రోనిల్ తగిన మోతాదులలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కావలి రూరల్: పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం శ్రీచైతన్య కళాశాల ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులు పరీక్ష సామగ్రి అందించి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచితంగా వెళ్లే వెసులుబాటు కల్పించారన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోళ్ల అమరజ్యోతి, వైస్ చైర్మన్ సయ్యద్ ఘనీబాషా, స్కూల్ అసిస్టెంట్లు సయ్యద్, హయ్యుమ్, మధుసూదన్‌రావు, మాలకొండయ్య పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్‌పై అవగాహన



అల్లూరు: అవగాహన కల్పిస్తున్న ఐడీసీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి

ఉదయగిరి: పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని దాసరపల్లి, ఉదయగిరి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పోషక విలువలు కలిగిన ఆకు కూరలు, కూరగాయలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చాంద్ బేగం, జబీన్, వహీదా, తులసీ, సుప్రజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్‌ను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు: పోషణ్ పక్వాడ్‌ను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐడీసీఎస్ సూపర్‌వైజర్ ఎ రాజేశ్వరి కోరారు. మంగళవారం అల్లూరు నగరపంచాయతీ అంజయ్యనాయుడు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పీచు అధికంగా ఉంటుందని, దానివల్ల జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, తక్కువ తిన్న చాలా సేపు ఆకలి కాదన్నారు. రక్తంలో ఉన్న చెడు కొవ్వును కరిగించడలో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆహారం

జలదంకి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలత తెలిపారు. మంగళవారం బ్రాహ్మణక్రాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బరత్తమ్మ, ఏఎన్‌ఎంలు వజ్రమ్మ, రమణయ్య, ఆశ కార్యకర్త వెంకటరమణమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.